కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.39, వంకాయ రూ.23, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.36, బీరకాయ రూ.38, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.41, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.18, సొరకాయ రూ.13, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.60, చామగడ్డ రూ.23, మునగ రూ.23, కందగడ్డ రూ.35, బీట్‌రూట్ రూ.23, కీర రూ.23, బీన్స్ రూ.60, క్యాప్సికమ్ రూ.47. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

మహాసభలను విజయవంతం చేయాలి


వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న షేక్ మహమూద్

సైదాబాద్: సీపీఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభను విజయవంతం చేయాలని ఐఎస్‌సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్ కోరారు. గురువారం డివిజన్ పరిధి సింగరేణి కాలనీలోని గిరిజన సమాఖ్య కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి మహాసభ వాల్‌పోస్టర్లను విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికై నిత్యం పోరాటాలు చేసే పార్టీ సీపీఐ అన్నారు. ఈ నెల 19 నుంచి 22 వరకు మేడ్చల్ జిల్లాలో నిర్వహించే మహాసభలకు భారీగా తరలివెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్‌నాయక్, జంగయ్య, దశరథ్, నర్సింగ్‌రావు, శ్యామ్యూల్, శ్రీను, రాజు, హరి, అజయ్ పాల్గొన్నారు.

ప్రమాదకర మ్యాన్‌హోళ్లపై రెడ్ పెయింట్


హష్మత్‌అలీ

చాదర్‌ఘాట్: ప్రమాదకర మ్యాన్‌హోళ్లను ప్రజలు తేలికగా గుర్తించేందుకు వాటి మూతలపై రెడ్ పెయింట్ వేస్తున్నామని మలక్‌పేట జలమండలి డీజీఎం హష్మత్‌అలీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మలక్‌పేట డివిజన్-1లో వరద వెళ్లే మార్గాలు, నీళ్లు నిలిచే ప్రాంతాలు 20 ఉన్నాయని వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద ఉన్న మ్యాన్‌హోళ్లు ఆరు అడుగుల లోతు కంటే తక్కువగా ఉన్న వాటికి కూడా సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మలక్‌పేటలో ముంపు ప్రాంతాల్లో 829 లోతైన మ్యాన్‌హోళ్లను గుర్తించామని ఇవి ఆరు అడుగుల కన్నా ఎక్కువ లోతులో ఉన్నాయని వరద సమస్య తలెత్తితే 155313కి నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఆలయం జోలికి రావొద్దు




హయత్‌నగర్: రోడ్డు వెడల్పులో భాగంగా హయత్‌నగర్‌లోని తొర్రూర్ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న సాయిబాబా ఆలయంలో కొంత భాగాన్ని కూల్చి వెనక్కు జరిపించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని ఎంతో మహిమ గల ఈ ఆలయం జోలికి రావొద్దని భక్తులు గురువారం నిరసన తెలిపారు. రోడ్డు వెడల్పుకు ఈ ఆలయం అడ్డురాదని రోడ్డుపక్కన అనేక అడ్డంకులు ఉన్నా అధికారులు ఈ ఆలయానికి మార్కింగ్ చేయడం తగదన్నారు. ఆలయానికి హాని చేస్తే భక్తుల మనోభావాలు దెబ్బతింటాని హెచ్చరించారు.

నూతన డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటు చేయాలి

హస్తినాపురం: శిథిలావస్థకు చేరిన డ్రైనేజీ పైపులైన్లు మార్చి నూతనంగా ఏర్పాటు చేయాలని భూపేశ్‌గుప్తానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నారగోని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. హైదరాబాద్ మెట్రోవాటర్‌వర్క్స్ మేనేజర్ సత్యనారాయణరెడ్డితో కలిసి గురువారం ఆయన కాలనీలోని డ్రైనేజీ వ్యవస్థ పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. 30 సంవత్సరాల క్రితం వేసిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్లను పూర్తిగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు.

మర్యాదపూర్వక కలయిక



నాగోలు: మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రీ కుమారుడు అనిల్ శాస్త్రిజీని గురువారం ఢిల్లీలోని ఆయన నివాసంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు.

ఓల్డ్‌మలక్‌పేట్‌లో కురిసిన వర్షానికి పారుతున్న వరదలోంచి ఇబ్బందులు పడుతూ వెళ్తున్న వాహనదారులు





భారీవర్షం.. రోడ్లు జలమయం



- జలమయమైన రహదారులు
- స్తంభించిన వాహనాలు


ఎల్‌బీనగర్‌లో కురుస్తున్న వర్షం

దిల్‌సుఖ్‌నగర్: భారీగా కురిసిన వర్షానికి మలక్‌పేట్‌జోన్ పరిధిలోని ప్రాంతాలు కాలనీలు, బస్తీలు అతలాకుతలమయ్యాయి. మలక్‌పేట్‌లోని ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. డ్రైనేజీలు పొంగడంతో వరదతో పాటు మురుగు ఏరులై పారింది. దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్, అక్బర్‌బాగ్, ఓల్డ్‌మలక్‌పేట్, మున్సిపల్ కాలనీ, పద్మనగర్, కాలడేర, మలక్‌పేట్ రైల్వే బిడ్జి, అజంపుర, తదితర ప్రాంతాల్లో భారీగా వరద పారగా మూసారంబాగ్, మలక్‌పేట్, నల్గొండక్రాస్‌రోడ్డు, మలక్‌పేట్ రైల్వేబిడ్జి, చాదర్‌ఘాట్, ఆర్‌కేపురం, అల్కాపురి చౌరస్తా ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు ఇక్కట్లు పడ్డారు.

ఎల్‌బీనగర్‌లో..

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ ప్రాంతంలోని రోడ్లు కుంటలను తలపించాయి. కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్తున్న ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వనస్థలిపురం, చింతలకుంట, హయత్‌నగర్, కొత్తపేట, చైతన్యపురి, నాగోల్ ప్రాంతాలలో వాహనాలు నెమ్మదిగా వెళడంతో ట్రాఫిక్ స్తంభించింది.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలి


జాతీయ పతాకంతో బీజేపీ నేతలు

మన్సూరాబాద్: ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. మన్సూరాబాద్‌లోని జిల్లా కార్యాలయంలో హర్ ఘర్ తిరంగా-తిరంగ యాత్ర సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 10 నుంచి 15 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రజల్లో దేశభక్తి, జాతీయభావాన్ని పెంపొందించేందుకు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయశ్రీతులసి, బండారి భాస్కర్, కొప్పెర శ్యామల, యశ్పాల్‌గౌడ్, జయప్రకాష్, హరీష్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, గుండె కిరణ్‌కుమార్, జితేందర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

మన్సూరాబాద్: సింధూర్ ఎన్‌క్లేవ్ హైరైజ్ అపార్ట్‌మెంట్స్ కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం కాలనీవాసులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ..సింధూర్ ఎన్‌క్లేవ్ ప్రధాన రహదారి మీదుగా పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయిస్తానని, ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులోని దూర ప్రాంతాల బస్టాప్‌ను మరోచోటికి తరలించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో అనంతరాములు, విజయసారథి, ఉమామహేశ్వర్‌రెడ్డి, మత్స్యగిరిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం


గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నేతలు

మన్సూరాబాద్: మన్సూరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మన్సూరాబాద్ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గంజి సత్తయ్య ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో, సహారాస్టేట్స్‌కాలనీ ప్రధాన గేటు వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద 11వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ చేరుపల్లి సీతారాములు సహారా వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో గంజి వెంకటేశం,సత్యనారాయణ, లక్ష్మినర్సింహ, సుధాకర్, సీతా వెంకటేశం, మారం నర్సింహా పాల్గొన్నారు.

ఘనంగా పవిత్రోత్సవం


పూజల్లో పాల్గొన్న భక్తులు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని గడ్డిఅన్నవర క్షేత్రం శ్రీవీరవెంకట సత్యనారాయణస్వామి ఆలయంలో గురువారం సంప్రక్షణ, పవిత్రోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో ఆలయ చైర్మన్ దంపతులు కోశాధికారి వక్కలంక శ్రీనివాసరావు, వసంతమనోహర్, ఉమాదేవి, మహేందర్‌రెడ్డి, పాల్తి శ్రీనివాస్, సంతోష్, రమేష్ పాల్గొన్నారు.

కాలనీ సంక్షేమానికి కృషిచేస్తాం


చంద్రమోహన్‌రెడ్డికి గెలుపుపత్రం అందజేస్తున్న సొసైటీ అధికారులు

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని అగ్రికల్చర్ కాలనీ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఎన్నికలలో గౌని చంద్రమోహన్ రెడ్డి నేతృత్వంలోని ప్యానల్ విజయం సాధించింది. గురువారం కాలనీ సంక్షేమ సంఘం భవనంలో నిర్వహించిన ఎన్నికలో చంద్రమోహన్‌రెడ్డి ప్యానల్ నుంచి 9 మంది సభ్యులు విజయం సాధించారు. జనరల్ కోటా నుంచి గౌని చంద్రమోహన్‌రెడ్డి, ఆమనగంటి జగత్‌రెడ్డి, గురువారెడ్డి, డి.సుధీర్‌రెడ్డి, చిట్టిపోలు రామునేత, చంద్రశేఖర్ శాస్త్రీ, మహిళా విభాగం నుంచి గౌని జ్యోతికిరణ్ రెడ్డి, గౌతరెడ్డి, వనితారాజశేఖర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కోటా నుంచి శ్రావి విజయం సాధించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాలనీ సంక్షేమానికి కృషిచేస్తామన్నారు.

పిల్లలతో సహా తల్లి అదృశ్యం



నాగోలు: ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, ముంగేలి, మండలం, బిజల్‌పూర్‌కు చెందిన రేఖ్‌చంద్రపుర్రే భార్య సంతోషి పుర్రే(24) పిల్లలు హతేష్ పుర్రే(6) నిధిపుర్రే(10నెలలు)తో కలిసి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గౌరెల్లి గ్రామంలోని సుత్రామి సువర్ణ భూమి అపార్ట్‌మెంట్ వద్ద నివాసముంటున్నారు. ఈ నెల 5న సాయంత్రం రేఖ్‌చంద్రపుర్రే తారామతిపేట మార్కెట్‌లో కూరగాయలు కొనడానికి వెళ్లి ఇంటికి వచ్చేసరికి భార్య, పిల్లలు కనిపించలేదు. పరిసరా తెలిసిన వారు బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో రేఖ్‌చంద్రపుర్రే పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పాఠశాలలో రక్షాబంధన్



నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని జైపురి కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు రక్షాబంధన్ ప్రాముఖ్యతను వివరించామన్నారు .ఒకరికి ఒకరు తోడుగా ఉండాలని అక్కాచెల్లెలు అనుబంధంతో ముడిపడిన పండగ రక్షాబంధన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంత రెడ్డి, మేరీ బ్యూల, గాయత్రి, రాజేశ్వరి, రమాదేవి పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల కేసులో యువకుడికి మూడేళ్ల జైలు

చంచల్‌గూడ: మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడికి జైలు శిక్ష విధించిన ఘటన మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. 2021 కుర్మగూడ డివిజన్ మాదన్నపేటలో నెల్లాటి భరత్ (27) ఇంటి అద్దె కోసం ఓ ఇంట్లోకి వెళ్లి మైనర్ బాలిక(17)తో అసభ్యంగా ప్రవర్తించి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. సదరు బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. నాలుగేళ్ల విచారణ తర్వాత బుధవారం కోర్టు యువకుడిని మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ. 10 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది.

జిల్లెలగూడ శ్రీవారి ఆలయ హుండీ లెక్కింపు

మీర్‌పేట: మీర్‌పేట జిల్లెలగూడలోని శ్రీ మత్స్యావతార వేంకటేశ్వరస్వామి దేవాలయ హుండీని గురువారం ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. 78 రోజులకు గాను హుండీ ఆదాయం రూ.1 లక్షా 45 వేల 233లు వచ్చినట్లు ఈఓ తెలిపారు. లెక్కింపులో పర్యవేక్షకుడు మురళీకృష్ణ, మాజీ ధర్మకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు


పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే అహ్మద్ బలాల

సైదాబాద్: కాలనీలు, బస్తీల్లో పురాతన డ్రైనేజీలను ఆధునీకరించడం ద్వారా వరద ముంపు సమస్య పరిష్కారమవుతుందని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. గురువారం మలక్‌పేట నియోజకవర్గం సైదాబాద్ డివిజన్ పరిధిలోని మూడుగుళ్ల చౌరస్తా నుంచి ధోబీఘాట్ చౌరస్తా వరకు రూ. 50.77 లక్షల వ్యయంతో నిర్మించనున్న సివరేజీ నిర్మాణ పనులను ఆయన సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సైదాబాద్ డివిజన్ శంకేశ్వరబజార్‌లో రూ. 16 లక్షలు, తిరుమలహిల్స్ నుంచి కల్యాణ్‌నగర్ వరకు రూ. 7 లక్షలతో సివరేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నామన్నారు. మలక్‌పేట నియోజకవర్గంలోని ఆరు డివిజన్‌లలోనూ ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ డీజీఎం హష్మత్‌అలీ, మేనేజర్ శ్రవణ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మనోహర్, శ్రీనివాస్, ఏఈ వెంకన్న, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ భూమేష్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి


స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: పరిసరాల పరిశుభ్రతగా ప్రాధాన్యం ఇవ్వాలని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీలో గురువారం జీహెచ్ఎంసీ, శానిటేషన్, ఎంటమాలజీ విభాగం అధికారులు, సిబ్బందితో కలిసి నిర్వహించిన మాన్సూన్ స్పెషల్ డ్రైవ్‌లో కార్పొరేటర్ పాల్గొని మాట్లాడారు. కాలనీలవాసులు తమ ఇళ్ల పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. శానిటేషన్, ఎంటమాలజీ సిబ్బంది డివిజన్‌లోని అన్ని ప్రాంతాలలో క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌నగర్ సర్కిల్ డీసీ మంగతాయారు, శానిటేషన్ డీఈ వెంట్‌రాజు, ఫక్రుద్దీన్, అర్జున్, ఏఈ శిరీష, ఎంటమాలజీ ఏఈ భారతి, యూసీడీ యాదయ్య పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి


వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

చైతన్యపురి: గణేష్ నవరాత్రి ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితీ ఎల్‌బీనగర్ శాఖ ఆధ్వర్యంలో జీహెచ్ఎంజీ ఈస్ట్ జోనల్ కార్యాలయంలో గురువారం వినతిపత్రం ఇచ్చారు. నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా సరూర్‌నగర్ చెరువు నీటిలో పూడికతీత చేపట్టి విగ్రహాలు పూర్తిగా మునిగేలా చేయాలని కోరారు. అలాగే నిమజ్జనానికి తరలివచ్చే మార్గాల్లో రహదారులు మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. చెరువు కట్టపై చెత్త ఎప్పటికప్పుడు తరలించే ఏర్పాట్లు, లైటింగ్, తాత్కాలిక టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో నరేష్‌కుమార్, బ్రహ్మచారి, కౌశిక్, లక్ష్మదేవి, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఫొటోథెరపీ యూనిట్ల ప్రారంభం


ఫొటోథెరపీ యూనిట్లను ప్రారంభిస్తున్న డా.నాగేందర్

వనస్థలిపురం: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మహేశ్వరం, వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో న్యూ బార్న్ స్టాబిలైజేషన్ యూనిట్ (ఎన్‌బీఎస్‌యు)లో డబుల్ సర్ఫేస్ ఫొటోథెరపీ రెండు యూనిట్లను గురువారం జీజీహెచ్ మహేశ్వరం సూపరింటెండెంట్ డా.బి.నాగేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టిన పిల్లలకు పచ్చ కామర్ల నివారణకు ఇవి దోహదపడతాయన్నారు. గతంలో ఉన్న ఫొటోథెరపీ రెండు యూనిట్లు పనిచేయకపోవడంతో ఇప్పటివరకు పిల్లలను నీలోఫర్ ఆసుపత్రికి పంపించేవారమని ఇప్పుడు ఈ సౌకర్యం ఆసుపత్రిలో అందుబాటులోకి వచ్చిందన్నారు. త్వరలో ఫిజియోథెరపీ సౌకర్యం కూడా అందుబాటులోకి రానుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డా.కృష్ణ, ఆర్ఎంఓ డా.జయమాల, పీడియాట్రిక్ హెచ్ఓడీ డా.అనిత, గైనిక్ హెచ్ఓడీ డా.అనిత, డా.ఉమాశంకర్, డా.సుధీర్‌బాబు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



ఎల్‌బీనగర్: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సూచించారు.సాహెబ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో సెంటర్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ సలహాదారులు, అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి మహమ్మద్ రఫిఉద్దీన్ ఆధ్వర్యంలో 250 ఔషధ మొక్కలను నాటారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. మన చుట్టూ చెట్లు ఉండడంతో కాలుష్యం తగ్గి మంచి వాతావరణం లభిస్తుందన్నారు. చిన్నప్పటి నుంచే విద్యార్థులకు చెట్ల ఆవశ్యకత గురించి తెలుపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ కవనా నాయక్, ప్రిన్సిపల్ దినేష్, నాయకులు శంకరయ్యగౌడ్, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

వరలక్ష్మి వ్రతానికి సర్వం సిద్ధం

పూజ సామగ్రి కొనుగోళ్లతో సందడిగా చౌరస్తాలు, రైతుబజార్లు


అష్టలక్ష్మీ అమ్మవారు, శ్రీమన్నారాయణస్వామి


పూలు, పూజ సామగ్రి కొనుగోలు చేస్తున్న స్థానికులు

దిల్‌సుఖ్‌నగర్: శ్రావణ శుక్రవారం వేడుకల నేపథ్యంలో ఆలయాలు వరలక్ష్మి వ్రతానికి ముస్తాబు చేశారు. మలక్‌పేట్, మహేశ్వరంజోన్ పరిధిలోని అమ్మవారి ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆర్‌కేపురం డివిజన్ వాసవికాలనీలోని శ్రీఅష్టలక్ష్మీ అమ్మవారి ఆలయం, శ్రీసరస్వతి దేవాలయంతో పాటు దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీసంతోషిమాత ఆలయం, శ్రీదుర్గాదేవి దేవాలయం,సైదాబాద్‌లోని శ్రీవిజయదుర్గాదేవి, జయదుర్గాదేవి అమ్మవారి ఆలయం, మలక్‌పేట్‌లోని శ్రీఅండాళ్ నిలయం, మాదన్నపేట్‌లోని దుర్గాదేవి ఆలయం, అక్బర్‌బాగ్, ఐఎస్‌సదన్ తదితర ప్రాంతాలలోని అమ్మవారి ఆలయాల్లో శుక్రవారం శ్రావణమాస వరలక్ష్మి వ్రతాలు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. శ్రావణ శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకొని వరలక్ష్మి వ్రతానికి పూజ సామాగ్రి, పూలు, పండ్ల ధరలు పెరిగాయి. బంతి కిలో రూ.200 నుంచి 250, చామంతి కిలో రూ.350 నుంచి రూ400 వందల వరకు, గులాబీ రూ. 250 నుంచి రూ.350 వందకు పెంచేశారు.

నేడు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలో అష్టలక్ష్మీ దేవాలయంలో శుక్రవారం నూతన ధ్వజస్తంభం, బంగారు పూతతో కవచము అలంకరణ చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. దేవాలయంలో శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం 4.30 లకు అష్టలక్ష్మీ దేవాలయంలో సుమారు రూ. 40 లక్షల వ్యయంతో నూతన ధ్వజస్తంభ యంత్ర ప్రతిష్ఠాపన నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.